## క్లుప్తంగా

### నేడు సమావేశం

తానూరు: తానూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండలకేంద్రంలోని ఆయా దుకాణ సముదాయాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సై షేక్ జుబేర్ ఓ ప్రకటనలో తెలిపారు. తానూరులో కొద్ది రోజులుగా జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముధోల్ సీఐ మల్లేశ్ హాజరవుతారని.. దుకాణ యజమానులు సకాలంలో రావాలని కోరారు.

### ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజేందర్



ఖానాపూర్: ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఖానాపూర్ వాసి గుగ్గిల్ల రాజేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఇటీవల జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని రాజేందర్‌గౌడ్ తెలిపారు. నూతన అధ్యక్షుడిని మంగళవారం పట్టణంలో ఆర్టిస్టులు ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్, అమర్, సూరి, రాజేందర్, సుధ, గంగాధర్ ఉన్నారు.

**నిర్మల్ పట్టణ కార్యవర్గం..**

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ ఆర్టిస్ట్స్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. ఇందులో పట్టణ అధ్యక్షుడిగా తిరుక్కోవేల రవి, ఉపాధ్యక్షుడిగా రాజేశ్, ముబీన్, ప్రధాన కార్యదర్శిగా ధనాలకోట కృష్ణవర్మ, కోశాధికారిగా చందుపట్ల వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా సాయి, ప్రచార కార్యదర్శిగా తోకల రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వేణుగోపాల్, కృష్ణంరాజ్ హాజరయ్యారు.

### రోడ్డుకు మరమ్మతు



ట్రాక్టర్‌తో మరమ్మతు చేయిస్తున్న రైతులు

కుంటాల: మండలంలోని ఓలా–లింబా(కె) ఫార్మేషన్ రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో లింబా(కె) గ్రామం నుంచి పంటల వద్దకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం లింబా(కె) శివారు రైతులు రూ.40 వేలు వెచ్చించి రోడ్డుపై మొరం వేయించి మరమ్మతులు చేపట్టారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, ఆత్మ డైరెక్టర్ మహేందర్, వీడీసీ మాజీ చైర్మన్ ఆనంద్‌రావు, గజ్జారాం, దేవిదాస్ ఉన్నారు.

### ఎన్నికల నిబంధనలు పాటించాలి

కుంటాల: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ఆడె కమల్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### సూపర్‌వైజర్‌గా ఎంపిక



శ్రీజని

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన చింతకుంట లక్ష్మి–శేఖర్ దంపతుల కూతురు శ్రీజని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోస్టుకు ఎంపికైంది. మహిళా, స్త్రీశిశు, సంక్షేమశాఖలో పోస్టులకు సంబంధించి పరీక్ష ఫలితాలను ప్రభుత్వం ఇటీవల విడుదల చే సింది. పదోతరగతి పొన్కల్ జిల్లా పరి షత్ సెకండరీ పాఠశాలలో చదివిన శ్రీజని అనంత రం హైదరాబాద్‌లో ఉన్నత చ దువులు పూర్తిచేశారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### కావేరి గ్రంథాలయంలో చదివిన ముగ్గురికి కొలువులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని అప్పాల కావేరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డా.కావేరీ గ్రంథాలయంలో చదివిన ముగ్గురు అభ్యర్థులు గ్రూప్–2 కొలువులు సాధించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో చేపూరి రాజు సబ్ రిజిస్ట్రార్‌గా, ఎమ్.రాజుకుమార్ ఎంపీవోగా, కల్లెం రమేశ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికవగా.. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి, కోశాధికారి అప్పాల శశికల వారికి అభినందనలు తెలిపారు. ఇప్పటికీ 144 మంది ఈ లైబ్రరీలో చదివి కొలువులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

### స్పందించిన కలెక్టర్

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామం నుంచి భైంసా మండలంలోని తిమ్మాపూర్ వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్‌కు నిర్మల్‌లో ప్రజా ఫిర్యాదుల విభాగంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీఆర్ ఏఈ గౌరీశ్ మంగళవారం రోడ్డును పరిశీలించారు. త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

# అధ్వాన రోడ్లతో కష్టాలు

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



హథ్‌గాంకు వెళ్లే మార్గంలో కంకర తేలి ప్రమాదకరంగా రోడ్డు

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో అధికారులు, పాలకులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**మరమ్మతు కరువు..**

మండలంలోని సేవాలాల్ తండా ఎక్స్ రోడ్డు నుంచి లక్ష్మీనగర్, హథ్‌గాం, సాథ్‌గాం, బిలోలి మీదుగా హావర్గా వరకు 12 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. భారీవర్షాలకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి పలుచోట్ల కోతకు గురైంది. వాహనచోదకులు ఓ గుంతను తప్పించే క్రమంలో మరో గుంతలో పడుతున్నారు. 17 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా.. రోడ్ల దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్లుకు వెంటనే మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రయాణమంటే జంకుతున్నాం



మండలంలోని లక్ష్మీనగర్ మీ దుగా పెండ్‌పల్లి వెళ్లాలంటే జంకుతున్నాం. రోడ్డంతా గుంతలు ఏర్పడుతున్నాయి. ఒక గుంతను తప్పిస్తే మరో గుంతలో పడే అవకాశం ఉంది. రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి.

– ఆనందం, వాహనదారుడు, రాయపూర్‌కాండ్లీ

### తారురోడ్డు నిర్మించాలి



మండలంలోని హావర్గా నుంచి బిలోలి, సాథ్‌గాం గ్రామాల్లో రోడ్లు కంకర తేలడంతో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలి.

– నారాయణ్, ప్రయాణికుడు,రాజురా

### ప్రతిపాదనలు పంపించాం

లోకేశ్వరం మండలంలోని లక్ష్మీనగర్ నుంచి సాత్‌గాం గ్రామాలకు వెళ్లే రోడ్లపై గుంతలు పడ్డాయి. ఈవిషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగానే రోడ్లకు మరమ్మతులు ప్రారంభిస్తాం.

– గౌరీశ్, పీఆర్ ఏఈ, లోకేశ్వరం

# కనుల పండువగా నవరాత్రి ఉత్సవాలు



సర్సాపూర్(జి): రాంపూర్‌లో బోనాలతో భక్తులు



సోన్: న్యూవెల్మల్‌లో బోనాలతో దుర్గాదేవి మండపానికి వస్తున్న భక్తులు



భైంసారూరల్: ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు అమ్మవారి ఫొటో అందిస్తున్న సభ్యులు



లోకేశ్వరంలో అగ్నిగుండం ఆకారంలో ఏర్పాటు చేసిన దీపాల నడుమ భక్తురాలు



కుంటాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



లక్ష్మణచాంద :పొట్టపెల్లిలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు మంగళవారం మహాగౌరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి మండపాల వద్ద పూజలు, అభిషేకాలు, హోమం చేశారు. భక్తులు ఇంటి నుంచి బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. జిల్లాకేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. భైంసా మండలం వానల్‌పాడ్‌లో స్వయంభుగా వెలిసిన దుర్గమ్మను ఎమ్మెల్యే రామారావు పటేల్ దర్శించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

# నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్



పట్టుకున్న వాహనాలు పరిశీలిస్తున్న సీఐ అజయ్

దస్తురాబాద్: సమాజంలో నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ అజయ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని భూత్కూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సరైన ధ్రువపత్రాలు లేని 2 ట్రాక్టర్లు, 5 ఆటోలు, 82 బైక్‌లు స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజల రక్షణ పోలీసుల బాధ్యతన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరం ఉండి.. లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. అపరిచితుల ఫోన్ కాల్స్, మెసెజ్, వాట్సప్ కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. కార్యక్రమంలో కడెం, పెంబి, ఖానాపూర్, దస్తురాబాద్ ఎస్సైలు సాయికృష్ణ, హన్మండ్లు, జ్యోతిమణి, సాయికుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 2న సాయిబాబా పుణ్యతిథి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గండి రామన్న దత్త సాయి ఆలయంలో ఈనెల 2న విజయదశమి రోజున సాయిబాబా 107వ పుణ్యతిథిని నిర్వహిస్తున్నట్లు సాయి దీక్ష సేవాసమితి సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజలో భాగంగా తెల్లవారుజామున 5:50 గంటలకు సాయిబాబాకు మంగళాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, తర్వాత అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు పల్లకి సేవ, శమీ పూజ నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

### సన్మానం

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల టీజీపీఎస్సీ వెల్లడించిన గ్రూప్–1 ఫలితాల్లో జిల్లాకేంద్రానికి చెందిన జసింత్ జోయల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై ఆసిఫాబాద్‌లో నియమితులవగా జిల్లా పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజేతను సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు, నాయకులు కె.పరమేశ్వర్ రెడ్డిచ, భూమారెడ్డి, అమర్‌సింగ్, తల్లిదండ్రులు సలోమీ కరుణ, డేనియల్ తదితరులున్నారు.

కుంటాల: ఉద్యోగులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని లింబా(కె) ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏనుగు రాజారెడ్డి సూచించారు. ఇటీవల వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో గ్రామానికి చెందిన ప్రదీప్ ఎంపీవోగా, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన వినోద్, వీడీసీ చైర్మన్‌గా ఎన్నికైన బద్దం వెంకట్ రెడ్డిని మంగళవారం సన్మానించారు. పీపీ నవీన్ కుమార్, ఎస్సై నాగనాథ్, దత్తురాం, వినాయక్‌రెడ్డి, రాజన్న, పోతన్న, ఉమాకాంతరావు, సంతోష్ పాల్గొన్నారు.

# ‘స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి’



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్



కుభీర్‌లో హాజరైన కార్యకర్తలు

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. పార్టీ మండల, గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ మండలస్థాయి సమావేశం నిర్వహించగా నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ కొమ్రేవార్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లోలం శ్యాంసుందర్, మండలాధ్యక్షుడు అనిల్, మొయినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ చరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దస్తురాబాద్: బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్ అన్నారు. దస్తురాబాద్‌లో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి.. పోటీకి ఆసక్తి ఉన్నవారి వివరాలు సేకరించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

లోకేశ్వరం: ప్రతి గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవాలని జిల్లా టోలి సభ్యుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు సంటేన్న అన్నారు. మంగళవారం మండలంలోని కిష్టాపూర్‌లో కల్లూర్‌ఖండ కిష్టాపూర్‌శాఖ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. సంటేన్న మాట్లాడుతూ వచ్చే దసరా నాటికి ఆర్‌ఎస్‌ఎస్‌కు 100 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హిందుత్వ పరిరక్షణ, అఖండ భారత నిర్మాణం కోసం ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులను తీర్చిదిద్దుతుందని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి, సురేందర్, వీడీసీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, భోజన్న, సుమన్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, మహేశ్ ఉన్నారు.

### కార్మికులకు దుస్తులు అందించిన ‘ఓకేఆర్’



కార్మికులకు దుస్తులు అందిస్తున్న కృష్ణంరాజు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పని చేసే 45 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఓకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘ భవనంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు రూ.50 వేల విలువైన దుస్తులు అందజేశారు. ఐదేళ్లుగా పండుగకు దుస్తులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఉరుస్తున్న గదులు, తడుస్తున్న దస్త్రాలు



తడుస్తున్న రికార్డులు



వరండాలో చేరిన వర్షపు నీరు

లోకేశ్వరం తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో చిన్నపాటి వర్షాలకే గదులు ఊరుస్తూ.. భూరికార్డులు, ఇతర దస్త్రాలు తడిసిపోతున్నాయి. సిబ్బంది ఎప్పటికప్పుడు వర్షపునీటిని బయటకు ఊడుస్తున్నారు. కార్యాలయానికి వచ్చేందుకు సిబ్బంది, ప్రజలు జంకుతున్నారు. పక్కనే ఆరేళ్ల కిందట చేపట్టిన నూతన భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. పాత భవనానికి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – లోకేశ్వరం

# వైభవంగా పూల పండుగ



కుంటాల: విఠాపూర్‌లో బతుకమ్మతో చిన్నారులు



దిలావర్‌పూర్‌లో..



ఖానాపూర్‌లో పాల్గొన్న కమిషనర్, సిబ్బంది

కుంటాల: మండలంలోని వెంకూర్, విఠాపూర్ గ్రామాల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కమిషనర్ సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది బతుకమ్మల వద్ద ఆడి పాడారు. అనంతరం సదర్మాట్ కాలువలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ఆలయ కోనేటి వద్ద నిమజ్జనం చేశారు.

# అన్నివర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కులు అందుకున్నవారితో నారాయణ్‌రావు

భైంసాటౌన్: అన్నివర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి. నారాయణ్‌రావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో నియోజకవర్గంలోని 18 మంది లబ్ధిదారులకు రూ.ఆరు లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, నాయకులు రాంచందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు బషీరుద్దీన్, పుండ్లిక్, గంగారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

**పల్లెబాటకు రూ.2.47కోట్ల నిధులు..**

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు పల్లెబాట కింద మొరం రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గానికి రూ.2.47 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

**సమాజాభివృద్ధికి పాటుపడాలి**

ప్రతిఒక్కరూ సమాజ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా పాటు పడాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి. నారాయణ్‌రావు పటేల్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మరాఠా సంఘం ప్రతినిధులు మంగళవారం భైంసా పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మరాఠా సంఘం ప్రతినిధులు పుండ్లిక్‌రావు, మోహన్‌రావు, కాశీనాథ్, సంపత్, లక్ష్మణ్ రావు, సాయికృష్ణ, దర్శన్, తదితరులున్నారు.

### పువ్వు ఇచ్చి.. అవగాహన కల్పించి



విద్యార్థులతో పువ్వు ఇప్పించి హెల్మెట్ ప్రయోజనాలు వివరిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ భారం కాదని.. భరోసా అని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జయశంకర్ చౌరస్తా వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులకు విద్యార్థులతో పువ్వు ఇప్పించి హెల్మెట్ ధరిస్తే కలిగే లాభాలను వివరించారు. మద్యం తాగి నడపడం, సిగ్నల్ జంపింగ్, అతివేగంతో కలిగే దుష్పరిణామాలను సీఐ వివరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై లింబాద్రి, ఏఆర్ ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాసరకు జనచైతన్య బైకు యాత్ర



రైల్వేస్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

బాసర: గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జనచైతన్య బైకు యాత్ర మంగళవారం బాసర చేరుకుంది. గత నెల 21న సూర్యపేట జిల్లాకేంద్రం నుంచి ప్రారంభించినట్లు ప్రభాకర్ తెలిపారు. సుమారు 2,000 కిలోమీటర్లు తిరిగి మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు తీసుకుంటే కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించారు. లక్ష్యం నిర్దేశించుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని యువతకు సూచించారు. నో డ్రగ్స్ లైఫ్ అని పిలుపునిచ్చారు.

### అడెల్లి పోచమ్మకు బోనాలు



కాలినడకన వస్తున్న భక్తులు

సారంగపూర్: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని జామ్ గ్రా మానికి చెందిన దాదాపు 60మంది మహిళా దీక్షాపరులు బోనాలు ఎత్తుకొని నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. సంప్రదాయం ప్రకారం అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఖానాపూర్ వాసుల ప్రతిభ

ఖానాపూర్: హైదరాబాద్‌లోని నాగోలులో గత నెల 28న నిర్వహించిన అంతరాష్ట్ర మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఖానాపూర్ వాసులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. మంకీ ఫిస్ట్ కుంగ్‌ఫు సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన స్పారింగ్ కటాస్ స్టిక్ ఫైటర్ పోటీల్లో ఖానాపూర్‌కు చెందిన సీనియర్ మాస్టర్లు లోకిని రాము, తుదిగేని రాజలింగు, గుగ్గిల్ల చంద్రశేఖర్‌గౌడ్‌కు గ్రాండ్ మాస్టర్ మదన్‌కుమార్ ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ రాజరావు, మంకీ ఫిస్ట్ కుంగ్‌ఫు సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ తదితరులు ఉన్నారు.